వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 311 గురువారం | 27 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





# లోటుపాట్లు ఉండొద్దు

మంత్రులు సురేఖ, సీతక్క

సీఎం పర్యటనపై అధికారులతో సమీక్ష

# సీఎంపైనే ఆశలు..

**కల్లు, గుడాలతో దావతా..**

**లేక రేవంత్ రెడ్డి మార్క్ కనిపించేనా**

**మురికి కూపంగా నగరం**

**చినుకు పడితే లోతట్టు ప్రాంతాలు జలమయం**

**బల్దియాలో అవినీతి రాజ్యం**

**కనీస వసతులు లేక నగర జీవనం నరకం**


వివరాలు 2లో..

నగర ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఆయన రాకతోనైనా నగరం అభివృద్ధివైపు అడుగులు వేస్తుందని ఆశలు పెట్టుకున్నారు. నగర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన గ్రేటర్ వరంగల్ మహా నగరపాలక సంస్థ సిబ్బంది అవినీతిలో కూరుకుపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే నగరం మురికి కూపంగా మారిందని ఆరోపిస్తున్నారు. ప్రతి టెండర్ లో పర్సంటేజీలు కామన్ గా మారాయని, అదే విధంగా బల్దియాకు వివిధ పనులమీద వచ్చే వారు చేతులు తడుపందే పనులు కావడం లేదన్న విమర్శలున్నాయి. స్మార్ట్ సీటీ పేరిట దోచుకున్న పెద్దలు నగరాన్ని మురికి కూపంగా మార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి తన మార్క్ ను చూపిస్తే తప్పా గ్రేటర్‌లో అభివృద్ధి పరుగులు పెట్టదంటున్నారు. యథా రాజా తథా ప్రజా అన్నట్లుగా సాగుతున్న బల్దియా పాలనపై సీఎం ప్రత్యేక దృష్టి సారిస్తారా లేక గత సీఎం మాదిరిగానే మాటల గారడీ చేసి కల్లు, గుడాలతో దావత్ చేసుకుందామంటూ కనుమరుగవుతారా అన్న ప్రశ్నా నగరంలో వైరల్ అవుతోంది. శుక్రవారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశంతో నగరాభివృద్ధిపై నీలి నీడలు తొలగిపోతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్




# సీఎంపైనే ఆశలు..



**కల్లు, గుడాలతో దావతా..**

**లేక రేవంత్ రెడ్డి మార్క్ కనిపించేనా**

**మురికి కూపంగా నగరం**

**చినుకు పడితే లోతట్టు ప్రాంతాలు జలమయం**


**బల్దియాలో అవినీతి రాజ్యం**

**కనీస వసతులు లేక నగర జీవనం నరకం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో అభివృద్ధి పేరిట అవినీతి రాజ్యమేలుతోంది. స్మార్ట్ సిటీ పేరిట పెద్దమొత్తంలో అక్రమాలు జరిగాయి. అభివృద్ధి పనులు ప్రారంభించడం..పర్సంటేజీలు తీసుకోవడం..ఆతర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పరిపాటిగా మారింది. దీంతో ఎటు చూసినా చెత్తకుప్పలు..కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం..రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు..అడుగుకో గుంతలా మారిన రహదారులు..గల్లీకో పైప్ లైన్ లీకేజీ..వెరసి తాగునీటి కష్టాలు నగర ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వరంగల్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గతంలో భద్రకాళి తాగు నీటి జలాశయాన్ని వినియోగించుకోగా నేడు దానిని మురికినీటి చెరువుగా మార్చారు. దీంతో అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు కంపు వాసన స్పెషల్ ఎఫెక్ట్ గా మారింది. గుర్రపు డెక్కతో పచ్చిక బయళ్లులాగా మారిన చెరువులే లక్ష్యంగా ఆక్రమణలకు తెగబడుతున్న రియల్టర్లతో చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయి. స్మార్ట్ సిటీ పేరుతో విడుదలైన కోట్ల రూపాయలు బురదలో పోసిన పన్నీరుగా మారాయి. దీంతో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే గత సీఎం మాటల గారడి మాదిరిగానే కల్లు, గుడాలతో దావత్ చేసుకుందామన్నట్లుగా ఉంటుందా లేక రేవంత్ రెడ్డి మార్క్ కనిపిస్తుందా అని నగర ప్రజల ఆశగా ఎదురు చూస్తున్నారు.

### అవినీతిమయం..

నగర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన గ్రేటర్ వరంగల్ మహా నగరపాలక సంస్థ సిబ్బంది అవినీతిలో కూరుకుపోయారు. ప్రధాన కార్యాలయంతోపాటు వార్డు కార్యాలయాలు కూడా అవినీతికి నిలయాలుగా మారాయి. దీంతో నగరంలో జీవనం నరకంగా మారింది. జవాబుదారీతనం మచ్చుకైనా కానరావడం లేదు. సిటిజన్ చార్టర్ అమలును అటకెక్కించారు. బల్దియా కార్యాలయంలో చేయి తడపందే ఏ పని జరిగే పరిస్థితులు లేవు. ప్రతి పనికి ఓ రేట్ ఫిక్స్ చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. బల్దియా కార్యాలయంలో పనిచేసే ప్రతి ఉద్యోగి అనతి కాలంలోనే కోట్లకు పడగెత్తుతున్నారు. వీరిపై విజిలెన్స్ విచారణ చేపడితే దోషులు బయటపడే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడంలేదు. కనీసం ఈ సీఎం అయినా లంచాల్లో మునిగితేలుతున్న అధికారులపై ఉక్కుపాదం మోపి బల్దియాకు చెడ్డపేరు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



### అటకెక్కిన అభివృద్ధి..

స్మార్ట్ సిటీ పేరుతో నగరంలోచేపట్టిన అనేక పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ లు వాటిని పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఎటు చూసినా అసంపూర్తి రహదారుల నిర్మాణం, అంతంత మాత్రంగానే మురుగు కాలువల నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. నగరం నాలుగు దిక్కుల ఏర్పాటు చేయనున్న కళాతోరణాలు దిష్టి బొమ్మల్లా మారాయి. తాగునీటి సమస్య నగర ప్రజలను వెంటాడుతోంది. గల్లీకో లీకేజీ సర్వ సాధారణంగా మారింది. అడుగుకో గుంత అన్నట్లుగా నగర రహదారులు దర్శనమిస్తున్నాయి. వీధికుక్కలు, కోతుల బెడద నగర ప్రజలను పట్టి పీడిస్తోంది. బల్దియా ప్రధాన కార్యాలయంకోసం గుంత తవ్వి వదిలేశారు. భద్రకాళి బండ్ పనులు సంవత్సరాలుగా సా..గుతూనే ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలో ఏ ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి కాలేదని చెప్పుకోవచ్చు.

### కల్లు, గుడాలతోనే సరా..?

గత సీఎం మాటల గారడీ మాదిరిగానే కల్లు, గుడాలతోనే సరిపెడుతారా లేక సీఎం మార్క్ ను రేవంత్ రెడ్డి చూపిస్తారా అని నగర ప్రజలు ఎదురు చూస్తున్నారు. నగరంలో పేరుకుపోయిన అవినతీ, అక్రమాలకు చమర గీతం పాడాలని స్థానికులు కోరుతున్నారు. అవినీతి రహిత కార్యాలయంగా బల్దియాను తీర్చి దిద్దాలంటున్నారు. నగరంలోని అభివృద్ధిని పరుగులు పెట్టించాలంటున్నారు. అవినీతిలో కూరుకుపోయిన బల్దియా అధికారులను విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై నగర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా ఆయన పర్యటన సాగాలని కోరుకుంటున్నారు.



# పేదలకు ఉచిత వైద్యం మా లక్ష్యం

**రేపు సీఎం చేతులమీదుగా 23 వ అతిపెద్ద మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం**

**మెడికవర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరి కృష్ణ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదలకు ఉచిత వైద్య సేవలు అందిచడమే లక్ష్యంగా వరంగల్ లో మెడికవర్ హాస్పిటల్ ను ఏర్పాటు చేశామని మెడికవర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరి కృష్ణ ప్రకటించారు. రాష్ట్రంలోనే 23 వ అతిపెద్ద మెడికవర్ హాస్పిటల్ ను వరంగల్ లో ఈ నెల 28న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గురువారం మెడికవర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరి కృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మెడికవర్ హాస్పిటల్ లలో 6,000 బెడ్స్, 13,000 పైగా సిబ్బంది, 1,200 సూపర్ స్పెషలిస్ట్ లు అందుబాటులో ఉన్నారన్నారు. అన్ని రకాల రోగాలకు, కష్టమైన ఆరోగ్య సమస్యలకు హైదరాబాద్ కి వెళ్లకుండా వరంగల్ మెడికవర్ హాస్పిటల్ లోనే వైద్యం అందించనున్నట్లు ప్రకటించారు. వరంగల్ మెడికవర్ హాస్పిటల్ లో 300 బెడ్స్, 150 ఐసీయూ బెడ్స్, 60 ప్రత్యేక బెడ్ లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని రకాల వైద్య పరికరాలతో డయాలసిస్, ఏంఆర్ఐ, సీటి, క్యాట్ లెట్ మెడికల్ ఎక్యూమెట్స్ లతో కూడుకుందన్నారు. వేరే రాష్ట్రాల, జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా నుంచి అనుభవం కలిగిన డాక్టర్లను రిక్రూట్ మెంట్ చేయడం జరిగిందన్నారు. 10 సంవత్సరాల కాలంలో




23 హాస్పిటల్ లను ఏర్పాటు చేశామని, నాలుగు రాష్ట్రాలలో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక బెంగుళూరులో 22 వ హాస్పిటల్ ను ప్రారంభించమన్నారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ఇప్పుడు 23 వ అతిపెద్ద హాస్పిటల్ మన వరంగల్ లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వరంగల్ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిచడానికే లక్ష్యమన్నారు. అలాగే జర్నలిస్టులకు స్పెషల్ కార్డులు అందజేసి ఉచిత వైద్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు ప్రకటించారు. డాక్టర్లు, అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంట్రల్ హెడ్ నమ్రత్త కుబేర్, తెలంగాణ హెడ్ సిద్ద రెడ్డి, బిజినెస్ హెడ్ మహేష్ డిడ్యూల్ కార్, డాక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీపై చీటింగ్ కేసు



**వరంగల్ వాయిస్, క్రైం :** దళిత బంధు పథకం ఇప్పిస్తానని, ఎంజేపీ గురుకుల పాఠశాల సీట్లు కేటాయిస్తానని డబ్బులు తీసుకొని పనిచేయకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు శాయంపేట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం..మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన ముక్కెర రమేష్ 2022లో దళిత బంధు పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రగతిసింగారం గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, అదే గ్రామానికి చెందిన ఫంగ ఇంద్రయ్యతో కలిసి కుట్రపన్నారు. దళిత బంధు పథకం రావాలంటే ఎంపీపీని కలవాలని, లేకుంటే ఎన్ని రోజులు తిరిగిన పథకం రాదని ఇంద్రయ్య చెప్పడంతో, విషయం నమ్మిన రమేష్ ఎంపీపీని కలవగా దళిత బంధు పథకం రావాలంటే రూ.2 లక్షలు చెల్లించాలంటూ నమ్మబలికారు. దీంతో రమేష్ ఫోన్ పే ద్వారా రూ.50 వేలు, నగదు రూ.50 వేలను ఎంపీపీ తిరుపతిరెడ్డికి అందజేశారు. అదే విధంగా ఎంజీబీపీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ఇప్పిస్తానని మరో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. దళిత బంధు, ఎంజేబీపీ అడ్మిషన్లు ఇప్పించకపోవడంతో బాధితులు తమ డబ్బులు ఇవ్వమని అడగడంతో రేపు, మాపు అంటూ సంవత్సరాలు గడపడంతో, బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పంగ ఇంద్రయ్యపై కేసు నమోదు చేయగా, ఎంపీపీని గురువారం కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

# ఆదర్శమూర్తి ఆరెల్లి సుశీలమ్మ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ మాతృమూర్తి ఆరెల్లి సుశీలమ్మ సంతాప సభ గురువారం నగరంలోని ఖిల్లా వరంగల్ మధ్య కోటలో జరిగింది. సుశీలమ్మ, ఈనెల 17న మరణించగా నేటి ఆమె సంతాప సభకు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరెల్లి కృష్ణ విప్లవ విద్యార్థి సంఘంలో పనిచేసే క్రమంలో తన తల్లి ప్రోత్సహించేదని, అనేకసార్లు పోలీసులు కృష్ణ ఇంటిపై దాడి చేసిన ధైర్యంగా ఉండేదని వారు గుర్తు చేసుకున్నారు. కొడుకును పోలీసులు పట్టుకుపోకుండా కాపాడేదని విప్లవ విద్యార్థి సంఘ నాయకులకు, విప్లవ పార్టీ నాయకులకు, సహాయ సహకారాలు అందించే వారన్నారు. ముఖ్యంగా ప్రశ్నించే పద్ధతి, నిజాయితీగా ఉండాలని కృష్ణకు చిన్నతనం నుంచే నేర్పిందని వారు తెలిపారు. ఆరెల్లి కృష్ణ విద్యార్థి సంఘం నుంచి కార్మిక సంఘం విప్లవ పార్టీ రాష్ట్ర నాయకుడిగా ఎదగడానికి తన తల్లి అందించిన ప్రోత్సాహమేనని వారన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ అమ్మ అందించిన సహాయ సహకారాలు ఆదర్శాలు అనుసరించాలని వారు తెలిపారు. సంతాప సభకు ముందుగా సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు చంద్రన్న, సీపీఎం రాష్ట్ర నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, సీపీఐఎంఎల్ నాయకులు బైరబోయిన ఐలయ్య, హైదరాబాద్ నగర కార్యదర్శి విజయ్ తదితరులు మాట్లాడారు. న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, మైదం పాణి, ఇనుముల కృష్ణ, హరిబాబు, చిర్ర సూరి, గడ్డం సదానందంలతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు హాజరయ్యారు. ఈ సంతాప సభకు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు అధ్యక్షత వహించారు.

## రేపు మెగా టెక్స్టైల్ పార్క్‌ను సందర్శించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** రేపు సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శిస్తారని, పార్క్‌లో ఏర్పాటైన పరిశ్రమలు, మౌలికవసతుల కల్పనపై టీఎస్ఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించనున్న నేపథ్యంలో గురువారం గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును గురువారం అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరిశ్రమలు, పార్క్‌కు కేటాయించిన భూముల వివరాలతో కూడిన మ్యాప్‌తో పాటు హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెక్స్‌టైల్ పార్క్ సందర్శనకు శుక్రవారం వస్తున్న సందర్భంగా టీఎస్ఐఐసీ అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్‌లో మదనతుర్తి గ్రామానికి చెందిన, కోప్పు రాధిక–శీను కుమార్తె లక్ష్మీప్రసన్న నూతన వస్త్ర, ఫల పుష్పఅలంకరణ మహోత్సవానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, విద్యా సంస్థల అధినేత తక్కల్లపల్లి రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తన అనుచరవర్గంతో కలిసి చిన్నారి ప్రసన్నను ఆశీర్వదించారు.

## మొబైల్ వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆదిత్య బిర్లా గ్రూప్స్, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సాయిబాబా మందిరంలో గురువారం మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. మందిర చైర్మన్ మతకుమల్లి హరగోపాల్ పర్యవేక్షణలో ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్ లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డాక్టర్ సిద్ధార్థ మందిరానికి విచ్చేసిన భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేయడం జరిగింది. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ కమలాకర్, సిబ్బంది సోఫియా, అక్షిత, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శవాణి పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాల విక్రయం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నల్లబెల్లి మండలం కేంద్రంలో ఆదర్శవాణి ప్రైవేట్ పాఠశాలలో విచ్చలవిడిగా పుస్తకాల అమ్ముతున్నారని ఏఐఎఫ్ డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ) ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు తనిఖీ చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆదర్శ వాణి పాఠశాలలో విచ్చలవిడిగా అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలు స్కూల్లో పెట్టి అమ్ముతున్నారు. తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీనిపై ఏఐఎఫ్ డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజ్ పాఠ్యపుస్తకాలు అమ్మ కూడదని మండిపడ్డారు. ఒక దిక్కు ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకూడదని నిబంధనలు పెట్టినా వాటిని తుంగలో తొక్కి ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఇష్టమున్న ధరలకు విద్యార్థులకు అమ్ముతున్నారు. తక్షణమే ఉన్నత అధికారులు, ఎంఈఓ వెంటనే స్పందించి ఇలాంటి పాఠశాలపై చర్యలు తీసుకొని, పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## కార్పొరేట్ పాఠశాలలకు తొత్తులుగా విద్యాశాఖ అధికారులు

### డీఈఓ, ఎంఈఓలపై ఆర్జేడీకి ఏబీవీపీ ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో డీఈఓ, ఎంఈఓ అక్రమాల మీద ఆర్జేడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఏకశిలా హైస్కూల్ డబ్బాల్ కేయూ రోడ్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు మీద పాఠశాల పేరు ముద్రించి, యూనిఫామ్స్ టై , బెల్ట్ అమ్ముతున్నారని డీఈఓకు ఫిర్యాదు చేశాం. వారు మాతో ఎంఈఓను పంపించి యూనిఫామ్, బుక్స్ అమ్ముతున్న గదిని సీజ్ చేయడం జరిగింది. అయితే మరుసటి రోజు సీజ్ ఓపెన్ చేసి పాఠశాల యాజమాన్యం యథావిధిగా బుక్స్ విక్రయిస్తున్నారు. ఈ విషయంపై డీఈఓ, ఎంఈఓలకు తెలిపితే మేమే తీయమన్నాం, అయితే ఏంటీ అని నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అయ్యుండి కార్పొరేట్ పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై వారికి కొమ్ముకాయడంపై ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు. వెంటనే డీఈఓ, ఎంఈఓలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్జేడీని కోరారు. లేకుంటే రానున్న రోజులలో ఏబీవీపీ పెద్ద ఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తుందని హెచ్చరించారు.

# స్వప్నపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

### సీఐటీయూ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలు



**వరంగల్ వాయిస్, జనగామ:** జిల్లా కేంద్రాంలోని చంపకిల్స్ ఎంసీహెచ్ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న హాస్పిటల్ సెక్యూరిటీ ఆడెపు స్వప్నపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లెర్ల లలిత డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సెక్యూరిటీ స్వప్నను పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్ నియమ నిబంధనల మేరకు సెక్యూరిటీగా పనిచేస్తున్న స్వప్నను కొబ్బరి బోండాలు హాస్పిటల్ లోనికి తీసుకపోవద్దు అన్నందుకు ఘర్షణ పడి మహిళా అని చూడకుండా కాళ్లతో తన్ని, చేయి ఫ్యాక్చర్ అయ్యేలా వడిపెట్టి తీవ్రంగా గాయపరచడం అమానుషమని తీవ్రంగా ఖండించారు. హాస్పిటల్ సిబ్బందిపై దాడి జరిగితే హాస్పిటల్ సూపరెండెంట్, సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్లో సిబ్బందిపై అనేక విధాలుగా వేధింపులు దాడులు జరుగుతున్నాయని హాస్పటల్ వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ఔట్ పోస్టు లేకపోవడం వలన ఇలాంటి దాడులకు గురి కావాల్సి వస్తుందని తెలిపారు. ఎంసీహెచ్ హాస్పిటల్, జిల్లా ఆసుపత్రిలలో ఔవుట్ పోస్టు ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గాయపడిన సెక్యూరిటీ స్వప్నకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఈ సంఘటనపై వైద్యాధికారులు స్పందించకపోతే సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గంగరబోయిన మల్లేష్, రాజ్, ఎ.రమేష్ పాల్గొన్నారు.

# మావోయిస్టులకు ఎవరూ ఆశ్రయం ఇవ్వొద్దు

## ములుగు జిల్లా ఎస్పీ శబరీష్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఏజెన్సీ ప్రాంతంలో దట్టమైన అడవుల మధ్యలో జీవనం కొనసాగిస్తున్న గుత్తి గుంపు ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా జిల్లా ఎస్పీ శబరీష్ గురువారం మంగపేట పరిధిలో గల ముసలమ్మ గుట్ట గుత్తి కోయ గుంపును సందర్శించారు. ముసలమ్మ గుట్ట గుత్తి కోయ ప్రజలతో మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకోగా వర్షాకాలంలో వారు ప్రధానంగా తాగు నీరు, దోమల బెడద వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య తీర్చేలా వెంటనే చర్యలు చేపడుతానని, అలాగే వర్షాకాలం అయినందున దోమలతో సమస్య లేకుండా దోమతెరలు అందజేస్తామని తెలిపారు. మలేరియా, డెంగీ, ఇతర జ్వరాల పట్ల జాగ్రత్తలు వహించాలని, ఎవరికి వారు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలని, గర్భిణీ స్త్రీలు గానీ అనారోగ్యంతో ఉన్న పిల్లలు, పెద్దలు, ముసలివారు ఉంటే వెంటనే స్థానిక సీఐ, ఎస్ఐలకు తెలియచేయాలన్నారు. అక్రమంగా అడవిని ఎవరు నరకవద్దని ఎస్పీ వారికి సూచించారు. అలాగే తమ స్వార్థప్రయోజనాల కోసం అసాంఘిక శక్తులు గుత్తి కోయ అమాయక ప్రజలను మభ్యపెట్టి తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని, కాబట్టి, అసాంఘిక శక్తులకు ఎవరు కూడా ఆశ్రయం ఇవ్వొద్దని, అనుమానిత వ్యక్తులు తమ గూడాలకు వస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. అనంతరం పిల్లలకు చాక్లెట్, బిస్కెట్స్, అరటి పండ్లు పంచిపెట్టారు. పిల్లలను చదివించే దిశగా కృషి చేయాలని, దానికి తగినంత ప్రోత్సాహాన్ని పోలీస్ శాఖ ద్వారా అందిస్తానని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఏటూరునాగారం మహేష్ గితే ఐపీఎస్, డీఎస్పీ ములుగు రవీందర్, సీఐ ఏటూరునాగారం శ్రీనివాస్, ఎస్సై మంగపేట్ టీవీ సూరి, ఎస్ఐ ఏటూరునాగారం తాజుద్దీన్, స్పెషల్ పార్టీ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో నాలుగు ఆవులు, ఒక ఎద్దు మృతి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరులో విషాదం చోటు చేసుకుంది. తెగిపడిన విద్యుత్ తీగలు తాకి నాలుగు జెర్సీ ఆవులు, ఒక ఎద్దు మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కొయ్యూరు (కొండంపేట) గ్రామానికి చెందిన తెప్పల మధుసూదన్ అనే వ్యక్తి కి చెందిన నాలుగు జెర్సీ ఆవులు ఒక గేదే మేత కోసం బైటికి వెళ్లగా ఎడ్లపల్లి గ్రామ శివారు పంట పొలాల్లో తెగిపడిన విద్యుత్ వైర్ లు ఆవులకు తాకడంతో బుధవారం రాత్రి మూడు ఆవులు, ఒక ఎద్దు మృతి చెందగా, విద్యుత్ సరఫరా నిలిచి పోకపోవడంతో గురువారం ఉదయం మేతకు వెళ్లిన మరో రెండు ఆవులు కూడా అవే విద్యుత్ వైర్ కు తాకి మృతి చెందాయి. మృతి చెందిన వాటి విలువ సుమారు ఐదు లక్షలు ఉంటుందని ఆవుల యజమాని తెలిపాడు. ఒకే వ్యక్తికి చెందిన ఐదు మూగ జీవాలు మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని కొయ్యూరు పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులతో పాటు ఎంపీపీ మల్హల్ రావు, జడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ది లింగమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ మాట్లాడుతూ విద్యుత్ షాక్ తో ఆవులు మృతి చెందటం బాధాకరమని, సంఘటన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలి

## పీడీఎస్‌యూ నాయకుడు రంజిత్ కుమార్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పీడీఎస్ యూ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలల సర్వే నిర్వహించారు. ఈ సర్వేపై పీడీఎస్ యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఉన్న అనేక ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం విద్యార్థులకు సరియైన విధంగా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. చాలా పాఠశాలల్లో పూర్తిస్థాయి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపైన ప్రత్యేక దృష్టి సారించి మౌలిక సదుపాయాలు కల్పన యుద్ధ ప్రాదిపాకన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలానే ప్రభుత్వానికి ప్రభుత్వ విద్యా వ్యవస్థ పైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్ యూ నగర నాయకులు ముషారఫ్, అనిష్, రితిక్ పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో కృష్ణ కాలనీలో లండన్ కిడ్స్ స్కూల్ దగ్గర నుంచి శ్రీ చైతన్య స్కూల్ దగ్గర వరకు నిర్మిస్తున్న సీసీ, డ్రైనేజీ పనులను గురువారం కౌన్సిలర్లు బి.అజయ్ సారథి, బి.నీరజారెడ్డి ధర్మన్నలు స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డిలు మాట్లాడుతూ మురుగునీరు వర్షంతో వచ్చే వరద నీరును నియంత్రించడానికి సుమారు రూ.5లక్షలతో సీసీ డ్రైవర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కోసం 36వ వార్డులో సీసీ డ్రైనేజీలు ఏర్పాటు చేపిస్తున్నట్టు వారు తెలిపారు. 36వ వార్డులో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వార్డు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. వార్డులో ఉన్న అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీలో వార్డులకు రావాల్సిన నిధుల కోసం పోరాడుతూ ముందుకు పోతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెతుకు కుమార్, కార్తీక్, మహిపాల్ రెడ్డి, యాకుబ్, సోమేశ్వర్, ఐలయ్య, దామోదర్ రెడ్డి, కాంట్రాక్టర్ రాజేష్, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా బొజ్జతారకం 85వ జయంతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా బొజ్జ తారకం 85వ జయంతి సందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు సాంబన్న ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తారకం ఆశయాలను నెరవేర్చేందుకు ముందుకు వెళ్తామని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తాడిశెట్టి క్రాంతి కుమార్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మాట్లాడుతూ బొజ్జతారకం అంబేద్కర్ వాదిగా అంబేద్కర్ సిద్ధాంతాల కోసం, రాజ్యాంగ హక్కుల కోసం, ప్రజా హక్కుల కోసం పౌర హక్కుల నేతగా బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, అడ్వకేట్ గా విశిష్ట సేవలు అందించారన్నారు. వారి సేవలను ఎవరూ మరువలేరన్నారు. వారు స్థాపించిన పార్టీ ద్వారా ఈ సమాజానికి వేలాది మంది నాయకులను, జ్ఞాన సంపదను అందించారని, అలాంటి మహనీయులు వందల్లో వేళల్లో ఒక్కరే ఉంటారని, అలాంటి మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికి భూమి, ఉపాధి, ఉద్యోగాలు ముఖ్య ఆవశ్యకత అని విద్యా, వైద్యం అన్నీ కూడా పేద బలహీన వర్గాలకు అందిస్తే సమాజంలో వాళు గౌరవంగా బతికి సమాజానికి తిరిగి వారు సేవ చేసే విధంగా ఉంటుందని, వారికి ప్రభుత్వాలే భూమి ఉపాధిని కల్పించాలన్నారు. ఆనాడు వారు కారంచేడు దళితులపై జరుగుతున్న దాడుల మీద శాంతి చర్చలలో ప్రముఖ పాత్ర పోషించి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా మహిళ నాయకులు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ గా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నియమించారు. ఆయన ఇటీవలే పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆశీస్సులతో రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన విజయం తెలిసిందే. బీసీ వర్గానికి చెందిన ఎంపీ రవిచంద్రను పార్లమెంటరీ పార్టీ ఉప నేతగా నియమించడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు, బీసీలతో పాటు అన్ని వర్గాలవారు హర్షంవ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**వరంగల్ వాయిస్, కేసముద్రం:** తాను సాగు చేస్తున్న పొలానికి నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో రైతు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వాలేరు ప్రకాష్ (40) అనే రైతు రోజు మాదిరిగానే తాను సాగు చేస్తున్న వరిపొలానికి నీరుపెట్టేందుకు వ్యవసాయ బావి విద్యుత్ మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గుర్తించి ప్రకాష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రకాష్ కు భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రకాష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మద్యం తాగి వాహనం నడపొద్దు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ 08 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 7100 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సీఐ శ్రీధర్ ఆ సందర్భంగా వాహనదారులకు సూచించారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు తప్పవన్నారు.

# నేడు డయల్ యువర్ డీఎం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట, ఖిలా వరంగల్, ధర్మసాగర్, వేలేరు, జమ్మికుంట, కమలాపూర్, సంగెం, ఐనవోలు, జఫర్ గఢ్, వర్ధన్నపేట మండలాల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను, సూచనలు, సలహాలను ఇవ్వాలన్నారు. శుక్రవారం 11.00-12.00 గంటల వరకు 9959226049 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మెరుగైన సేవలు పొందేలా సూచనలు , సలహాలను ఇవ్వగలరని డీఎం తెలిపారు.

## అధిక ఫీజులు వసూలు చేయొద్దు



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నట్లు పత్రికలలో వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం పరకాల మండలంలోని ఎస్ఆర్ డీజీ స్కూల్ ను మండల విద్యాశాఖ అధికారి యస్.రమాదేవి, నోడల్ అధికారి నాగారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నామాని సాంబయ్యలతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తరగతి గదులు, పని చేస్తున్న ఉపాధ్యాయుల అర్హత, బస్సులు కండీషన్ లో ఉన్నాయా, డ్రైవర్ లకు లైసెన్స్ లు ఉన్నాయా, తరగతి వారీగా వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరకాల మండలంలో బడుగు బలహీన వర్గాల వారు ఎక్కువగా ఉంటారని, మంచి మార్కులు సాధించి ఫీజులు కట్టలేని వారు ఎవరైనా వస్తే వారికి ఫీజు తగ్గించి తీసుకోవాలని యాజమాన్యాన్నికోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇనగాల



**వరంగల్ వాయిస్, పరకాల :** దామెర మండల కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్ వివాహానికి వడ్డేపల్లిలోని శ్రీమాత బాంక్వెట్ హాల్ లో పరకాల నియోజకవర్గ ఇంచార్జి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గీసుగొండ మండలం మనుగొండ గ్రామంలో సారీ ఫంక్షన్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. గీసుగొండ గ్రామ ఎంపీటీసీ దౌడు భరత్ తండ్రి దౌడు కట్టయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

## కేసీఆర్‌ను కలిసిన అమ్మ అశోక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :**తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావును గురువారం ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## క్రీడాకారుడు బొమ్మరాజు శివాజీకి సన్మానం



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లాకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు అంతర్జాతీయ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. గురువారం కలెక్టర్ ఆఫీస్ లో ములుగు జిల్లాకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు ఇండియన్ టీంకి ఎంపికైన బొమ్మరాజు శివాజీని కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా సన్మానించారు. అలాగే జిల్లా క్రీడల అధికారి తులా రవి శివాజీని అభినందించారు. ములుగు జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా అంతర్జాతీయ స్థాయి క్రీడలకు శివాజీ ఎంపికవడం జరిగిందన్నారు. ఈ క్రీడాకారుడు జోర్డాన్ దేశంలో అమ్మాన్ లో జరగబోయే అంతర్జాతీయ టోర్నమెంట్లో పాల్గొనడం జరుగుతుందని కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

### సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని పర్మినెంట్ చేయాలని, పనిముట్లు ఇవ్వాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, సిఐటీయూ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ గడిచిన 10సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మికులు ప్రమాదంలో ఇటీవల కాలంలో చనిపోతున్న వారికి ఎక్స్ గ్రేషియా చెల్లించడం లేదని, చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకి పనిముట్లు, మాస్కులు, చెప్పులు, గ్లౌజ్ లు, సబ్బులు, కొబ్బరి నూనె, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ప్రభుత్వ ఆర్డరు ఉన్న దానిని మున్సిపల్ అధికారులు అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస వేతనాలు, పని భద్రత కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హనుమకొండ పర్యటనలో ఆ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, యూనియన్ నాయకులు ఏల్పుల ధర్మరాజు, ఎన్.రజిత, మున్సిపల్ యూనియన్ నాయకులు బరుపట్ల మహేష్, రఘు, ఎల్లస్వామి, నవనీత, యాస బాబు రాజేంద్రప్రసాద్, సుధాకర్ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల అభివృద్ధిపై అధికారులు నిబద్ధతో పనిచేయాలి

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని మునిసిపాలిటీల అభివృద్ధికి అధికారులు నిబద్ధతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి మునిసిపాలిటీ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలలో నిర్వహిస్తున్న సివిల్ పనులలో పూర్తయినవి, పెండింగ్ లో ఉన్నవి ఇంకా సాంక్షన్ అయి మొదలు కాని పనులపై అధికారులు నివేదికలు ఇవ్వాలని, ఇంటి పన్నుల వసూలులో వచ్చిన నిధులను మునిసిపాలిటీ లలో వినియోగంపై వాటి స్థితిని, గృహ నిర్మాణానికి అనుమతులపై అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని, ఆయా మున్సిపాలిటీల్లో నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు, ఇత్యాది పథకాల ద్వారా అందుతున్న నిధుల వివరాలను, వాటిని ఏయే పనుల కోసం వెచ్చిస్తున్నారన్నది అడిగి తెలుసుకున్నారు. మునిసిపాలిటీ శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మునిసిపల్ అధికారులు క్రింది స్థాయి సిబ్బందితో ఖచ్చితంగా రెండు రోజులకు ఒకసారి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని, పనుల స్థితిగతులపై ఫీల్డ్ సూపర్ వైజర్స్ తో సమావేశాలను నిర్వహించి పెండిగ్ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. బయోమెట్రిక్ హాజరు పక్కాగా నిర్వహించాలని, మునిసిపాలిటీ లోని అన్ని విభాగాల అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని, క్రమశిక్షణగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మునిసిపాలిటీలలో డ్రింకింగ్ వాటర్, పారిశుద్ధ్య ,తదితర పనులలో నిర్లక్ష్యంగా వ్యవహారించారాదని, పట్టణాలలో ప్రజలు వివిధ అనుమతులకై మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఇవ్వాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఈఈలు, డీఈలు, ఆర్ఐలు, సానిటరీ ఇన్ స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ అందుబాటులో వైద్యం ఉండాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** పట్టణంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందరికీ వైద్యం అందుబాటులో ఉండేలా ఆసుపత్రి యాజమాన్యం చొరవ తీసుకోవాలి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. జిల్లాలో ఆసుపత్రిలో ప్రజలకి అవసమైన అన్ని వ్యాధులకి చికిత్స నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలను కోరారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలోని మెయిల్ సర్జికల్ వర్డ్ రేడియాలజీ హమ్ క్యాజువాలిటీ డీఈఐసీ డయాలసిస్ ఇతర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులలో వివిధ విభాగాలలోని అవుట్ పేషేంట్, ఇన్ పేషేంట్ వార్డులలో, ఆరోగ్య శ్రీ వార్డులలో ఎన్ని బెడ్స్ ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజలకు అవసరాలకి అందుబాటులో అన్నిరకాల వ్యాధులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారుల సిబ్బంది హాజరు క్రమశిక్షణ సమయపాలన పాటించాలని, ఆస్పత్రి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యం అందించాలని, వర్షాబావ పరిస్థితులకు అనుగుణంగా కావాల్సిన అత్యవసర మందులు, వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి కావాల్సిన పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకట్ రాములు, ఆర్ఎంఓ డాక్టర్ బి.జగదీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రెస్ క్లబ్ కార్యదర్శి బొల్లారం సదయ్య జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య జన్మదిన వేడుకలను గురువారం ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ లో జరిగిన జన్మదిన వేడుకలలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై సదయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వరంగల్ అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, ఈసీ మెంబర్లు కంకణాల సంతోష్, వేణుమాధవ్, నేతలు రవి, సాయిరాం, దుర్గ ప్రసాద్, విష్ణువర్ధన్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 నేతలు బీఆర్ లెనిన్, మస్కపురి సుధాకర్, అనిల్, బొడిగె శీను, అమర్, టీజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసగించిన సీఎం రేవంత్ రెడ్డి

## రేపటి ఆయన పర్యటనను అడ్డుకుంటాం

## బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్



**వరంగల్ వాయిస్, కేయూ :** బాల సముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం సందర్భంగా బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్ హామీ ఏమైందని, మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వ ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఉద్యోగాలుగా అపాయింట్ మెంట్ లెటర్స్ ఇచ్చి 30వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉపన్యాసంలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల పోస్టులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఖాళీల సంఖ్యను పెంచకుండా నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఈ సంవత్సరం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యా శాఖ మంత్రి లేకపోవడం మీ పరిపాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. బాకీ ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వరంగల్ పర్యటనకు ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభానికి వస్తున్న రేవంత్ రెడ్డికి సెంట్రల్ జైల్ లో నిర్మిస్తున్న 24 అంతస్తుల ఆసుపత్రిని పూర్తి చేయకుండా, ఎంజీఎంను సందర్శించకుండా ఎలా ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభిస్తారని ప్రశ్నించారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. యూనివర్సిటీ పరిశోధన విద్యార్థులకు ప్రతి నెల రూ.15 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని, యూనివర్సిటీలల్లో వీసీల నియామకం లేక పరిపాలన భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమకారులకు 250 గజల స్థలం, రూ.10 లక్షలు హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాచర్ల శరత్ చంద్ర, ఉపాధ్యక్షులు కంజర్ల మనోజ్ కుమార్, రూరల్ జిల్లా కోఆర్డినేటర్ లంక రాజగోపాల్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, జిల్లా కార్యదర్శి హర్ష మధు, బీఆర్ఎస్వీ నాయకులు పసునూరి టోనీ, పస్తం అనిల్, రత్నం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీని కలిసిన సెంట్రల్ జోన్ డీసీపీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా బాధ్యతలు చేపట్టిన షేక్ సలీమా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.

# ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**వరంగల్ వాయిస్,కాశిబుగ్గ :** నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీ లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు ఆర్ఎంవో దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 15 ట్యాంకర్ల తాగునీరును సరఫరా చేశారు. గత మూడు రోజుల నుంచి నగరంలో తాగు నీరు రాని సందర్భంగా దీపక్ రెడ్డి మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి రోగులకు ఇబ్బంది కాకుండా 15 ట్యాంకర్ల తాగునీరు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఏఈ సతీష్, కృష్ణ, కన్స్ట్రక్షన్ సీనియర్ సూపర్ వైజర్ కుసుమ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్‌ను సందర్శించిన కార్పొరేటర్ మామిండ్ల రాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 31వ డివిజన్ హంటర్ రోడ్డులోని నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మెడి కవర్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా గురువారం స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు మెడి కవర్ హాస్పిటల్ ను సందర్శించారు. అనంతరం హాస్పిటల్ ఇంచార్జిలతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాల్సిందిగా హాస్పిటల్ వారిని కోరారు. ఓరుగల్లులోనే ఇలాంటి హాస్పిటల్ నిర్మాణం కావడం హంటర్ రోడ్డులోని మా డివిజన్ లో ఉండడం చాలా సంతోషకరమని, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉందని కార్పొరేటర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కాసం నమశ్శివాయ, డాక్టర్ దుర్గేష్, అర్చన, హాస్పిటల్ మేనేజర్ సిద్దారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏకశిల స్కూల్ వ్యాన్ బోల్తా

## పలువురి విద్యార్థులకు గాయాలు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ లో స్కూల్ వ్యాన్ బోల్తా పడింది. కమలాపూర్ నుంచి కన్నూరు గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు స్కూల్ వ్యాన్ ను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది స్కూల్ విద్యార్థులు ఉండగా ఏడవ తరగతి విద్యార్థిని అక్షయ గాయపడ్డారు. విషయం తెలియగానే ప్రమాద స్థలానికి తల్లిదండ్రులు, పోలీసులు చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు. సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రమాద స్థలం నుంచి కారు వ్యాను తొలగింపు చర్యలు చేపట్టారు. ఏకశిల స్కూల్ వ్యాన్ బోల్తా పడడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన పడ్డారు. ఈ ప్రమాదంతో హుజురాబాద్-పరకాల రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురులో ఇద్దరికీ తీవ్రగాయాలు, వ్యాన్ లో ప్రయాణిస్తున్న ముగ్గురు స్టూడెంట్స్ కి గాయాలు కాగా వారిని 108 ద్వారా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# రాజ్యసభ చైర్మన్‌తో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతల భేటీ



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ తో గురువారం ఢిల్లీలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ బండి పార్థసారథి రెడ్డిలు భేటీ అయ్యారు.

# టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర నాయకులకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లె మధు, కార్యవర్గ సభ్యులుగా కంకాణాల సంతోష్, పెండెం వేణుమాధవ్ లకు చోటు దక్కిన సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్, హనుమకొండ జిల్లా, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం దక్కటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ పటిష్టతకు కృషిచేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించాలని, జర్నలిస్టులకు అందుబాటులో ఉండాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పీవీ మదన్ మోహన్, గడ్డం కేశవ మూర్తి, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు సంగోజు రవి, కొండం రవీందర్ రెడ్డి, నార్లగిరి యాదగిరి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గ ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ నాయకులు సాయిరామ్, కే. దుర్గ ప్రసాద్, అల్లం రాజేశ్ వర్మ, పొడిచెట్టి విష్ణువర్ధన్, నయీంపాషా, మంచాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సాగుదారుడికి పదేళ్ల జైలు



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం గ్రామ శివారులో కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొట్ట కుమారస్వామి అనే వ్యక్తి 2017లో తన పత్తి పంటలో మిశ్రమ పంటగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై ఎన్. శ్రీకాంత్ రెడ్డి, పరకాల తహసీల్దార్ సమక్షంలో ఆ గంజాయి మొక్కలను పట్టుకొని లెక్కించగా అవి 20 మొక్కలుగా గుర్తించడం జరిగింది. వాటిని స్వాధీన పరుచుకోవడంతో పాటు నిందితుడిని అరెస్ట్ చేసి చార్జి షీట్ ను అప్పటి సీఐ జానీ నరసింహులు దాఖలు చేశారు. ప్రస్తుత పరకాల సీఐ రవి రాజు పర్యవేక్షణలో కోర్టు హెచ్‌సీఎం సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టి వాదోపవాదాలతో నిందితులకు పది సంవత్సరాల కఠిన కారగార జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమాన, జరిమానా కట్టకుండా ఒక సంవత్సరం అదనపు జైలు శిక్షఅనుభవించుటకు కోర్టు తీర్పు ఇవ్వనడమైందని పరకాల సీఐ రవిరాజు తెలిపారు



## గేమ్ ఛేంజర్‌ను త్వరగా పూర్తి చేస్తా: శంకర్

రామ్‌చరణ్ – శంకర్‌ల కాంబోలో తెరకెక్కుతోన్న సినిమా 'గేమ్ ఛేంజర్' చిత్రం నుంచి అప్‌డేట్ వచ్చి చాలా రోజులవుతోంది. తాజాగా దర్శకుడు శంకర్ దీనిపై అప్‌డేట్ ఇచ్చారు. 'ఇండియన్ 2' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' గురించి మాట్లాడారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలిఉంది. 'ఇండియన్ 2' రిలీజ్ కాగానే 'గేమ్ ఛేంజర్' ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాను. అన్ని పనులు పూర్తయిన తర్వాత రిలీజ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటా. సాధ్యమైనంతవరకు త్వరగానే రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా' అని శంకర్ చెప్పారు. అలాగే హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ.. శంకర్ ఓ సినిమాలో 2000 మందితో సన్నివేశాలు చిత్రీకరించారు. అవి అద్భుతంగా ఉన్నాయని అన్నారు. దీంతో సిద్దార్థ్ చెప్పింది 'గేమ్ ఛేంజర్' గురించేనని రామ్‌చరణ్ అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

# భారతీయ సినిమాకు మరో ఆణిముత్యం



## విజువల్ వండర్‌గా 'కల్కి 2898 ఏడీ'

బాహుబలి చిత్రాల తర్వాత ప్రభాస్ పూర్తిగా పాన్ ఇండియా హీరో అయిపోయారు. అందుకు తగినట్లే ఆయన ఎంచుకునే కథలు ఉంటున్నాయి. నాగ్ అశ్విన్, ప్రభాస్ కాంబినేషన్‌లో సినిమా అంటే అంచనాలు భారీగానే ఉంటాయి. అందుకు తగినట్లుగానే ఓ పాన్ వరల్డ్ సబ్జెక్ట్‌ను ఎంచుకుని పురాణాలను ముడిపెడుతూ 'కల్కి 2898 ఏడీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. భారీ బడ్జెట్, నాలుగేళ్ల నిర్మాణం, అమితాబ్, కమల్ వంటి అగ్ర తారాగణం నటించడంతో యావత్ భారతీయ సినీ పరిశ్రమ దృష్టిని ఆకర్షించింది. కురుక్షేత్రం తర్వాత ఆరు వేల ఏళ్లకు మొదలయ్యే కథ ఇది. భూమిపై తొలి నగరంగా పురాణాలు చెబుతున్న కాశీ, అప్పటికి చివరి నగరంగా మిగిలి ఉంటుంది. భూమిపై ఉన్న అన్ని వనరులను పీల్చేసి స్వర్గంలాంటి కాంప్లెక్స్‌ని నిర్మించి పాలిస్తుంటాడు సుప్రీం యాస్కిన్ (కమల్‌హాసన్). కాశీలో బౌంటీ ఫైటర్ అయిన భైరవ (ప్రభాస్) యూనిట్స్‌ని సంపాదించి కాంప్లెక్స్‌కి వెళ్లి అక్కడ స్థిరపడిపోవాలనే ప్రయత్నాల్లో ఉంటాడు. సుప్రీం యాస్కిన్ తలపెట్టిన ప్రాజెక్ట్ కె కోసం, కాంప్లెక్స్ సైన్యం కాశీకి వచ్చి గర్భం దాల్చే అవకాశాలున్న అమ్మాయిల్ని కొనుగోలు చేసుకుని వెళుతూ ఉంటుంది. అలా ఎంతోమంది అమ్మాయిల్ని ప్రాజెక్ట్–కె కోసం గర్భవతుల్ని చేసి, వారి నుంచి సీరమ్ సేకరిస్తూ ప్రయోగాలు చేపడుతుంటారు. అలా సుమతి (దీపికా పదుకొణె) కాంప్లెక్స్‌లో చిక్కుకుపోయి గర్భం దాలుస్తుంది. మరోవైపు రేపటి కోసం అంటూ శంబల ప్రజలు ఎన్నో త్యాగాలు చేస్తూ ఓ తల్లి కోసం ఎదురు చూస్తుంటారు. ఆ తల్లి సుమతి అని నమ్ముతారు. మరి ఆమెని కాంప్లెక్స్ ప్రయోగాల నుంచి ఎవరు కాపాడారు? చిరంజీవి అయిన అశ్వత్థామకీ, భైరవకీ సంబంధం ఏమిటి?సుప్రీం యాస్కిన్ ప్రాజెక్ట్ – కె లక్ష్యమేమిటి ..అన్నదే కథ.. హాలీవుడ్ చిత్రాలు చూస్తున్నప్పుడు మనం ఇలాంటి సినిమాలు తీయలేమా? ఇలా ప్రపంచం మొత్తాన్ని కూర్చోబెట్టి మన కథలు చెప్పలేమా?అనే ప్రశ్నలు తలెత్తుతూ ఉంటాయి. ఆ ప్రయత్నాన్ని విజయవంతంగా మనదైన కథతో చేసి చూపించారు దర్శకుడు నాగ్ అశ్విన్. కళ్లు చెదిరే విజువల్స్, లీనం చేసే కథ, బలమైన పాత్రలతో మన రేపటి సినిమా కోసం బాటలు వేశాడు. హాలీవుడ్ సినిమాల స్ఫూర్తితో కూడిన పాత్రలు, కల్పిత ప్రపంచాలు ఈ సినిమాలో కనిపించినప్పటికీ, వాటికి మన పురాణాల్ని మేళవిస్తూ కథ చెప్పిన తీరు అబ్బుర పరుస్తుంది.కురుక్షేత్ర సంగ్రామం సన్నివేశాలతో సినిమా ప్రారంభమవుతుంది. కథా ప్రపంచాన్ని, పాత్రల్ని పరిచయం చేస్తూ మెల్లగా అసలు కథలోకి తీసుకెళుతుంది సినిమా. ప్రభాస్ కూడా ఆలస్యంగానే తెరపైకొస్తాడు. నీటి జాడ లేని భవిష్యత్తు కాశీ నగరం, ఆక్సిజన్ కోసం, ఆహారం కోసం తల్లడిల్లే ప్రజలు, కాంప్లెక్స్ దురాగతాలు కథలో లీనం చేస్తాయి. నాగ్ అశ్విన్ ఇందులో హీరోయిజం కంటే కూడా, కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ సన్నివేశాల్ని మలచడం విశేషం. కథలోని మూడు ప్రపంచాలు వేటికదే భిన్నంగా ఉండేలా ఆవిష్కరించిన తీరు కట్టి పడేస్తుంది. ప్రథమార్ధంలో అక్కడక్కడా సన్నివేశాల్లో కొంత వేగం తగ్గినట్టు అనిపించినా ప్రభాస్, అమితాబ్ బచ్చన్ మధ్య సన్నివేశాలు మొదలైనప్పటి నుంచి తర్వాత ఏం జరుగుతుందనే ఉత్సుకత మొదలవుతుంది. చిన్న పిల్లలు సైతం ఇష్టపడేలా ప్రభాస్ పాత్ర కామిక్ టచ్‌తో సాగుతుంది. భారతీయ పురాణాల్లోని సూపర్‌హీరోలు ఎలా ఉంటారో మచ్చుకు కొంచెం చాటేలా ఉంటాయి ఆ సన్నివేశాలు. రెండో భాగం సినిమా కథ భైరవ యాస్కిన్‌తో ఉంటుందనే సంకేతాలతో తొలి భాగం కథ ముగుస్తుంది. వెండితెరపై ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించడంలో దర్శకనిర్మాతలు, సాంకేతిక బృందం విజయవంతమైంది. భారతీయ సినిమాని మరో మెట్టు ఎక్కించిన సినిమాగా ఇది నిలుస్తుంది. ప్రభాస్ తన కటౌట్‌కి తగ్గ పాత్రలో ఒదిగిపోయారు. కథే ప్రధానంగా సాగే సినిమా కావడంతో ప్రభాస్‌తో పాటు ఇతర పాత్రలూ బలంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు కథంతా అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె చుట్టూనే సాగుతున్నట్టు అనిపిస్తుంది. అమితాబ్ బచ్చన్ ఇమేజ్, ఆయన నటన ఈ సినిమాకి బాగా ఉపయోగపడింది. ఈ వయసులోనూ ఆయన పోరాట ఘట్టాలు చేసిన తీరు ప్రేక్షకుల్ని కట్టి పడేస్తుంది. బాహుబలి ప్రభాస్ కటౌట్‌కి దీటుగా కనిపించే పాత్రలో మరొకరిని ఊహించలేని విధంగా అమితాబ్ బచ్చన్ నటించారు. డీ గ్లామరస్‌గానే అయినా దీపికా పదుకొణె బలమైన పాత్రలో కనిపిస్తుంది. దిశా పటానీ పాత్ర అలా మెరిసి, ఇలా మాయమైపోతుంది. శోభన, అన్నాబెన్, పశుపతి, మానస్ పాత్రలో స్వాస్థ ఛటర్జీ తదితరులు పోషించిన పాత్రల పరిధి తక్కువే అయినా ప్రభావం చూపించారు. బ్రహ్మానందం, ప్రభాస్‌తో కలిసి కొన్ని నవ్వులు పంచారు. సుప్రీమ్ యాస్కిన్‌గా విలన్ పాత్రలో కమల్‌హాసన్ కనిపిస్తారు. ఆయన గెటప్ భయపెట్టేలా ఉంటుంది. ఇందులో ఆ పాత్ర పరిధి తక్కువే అయినా, పరిచయం చేసిన తీరు, మంచితనం ఎలా మారుతుందో చెప్పే కొన్ని మాటలు ఆలోచింపజేస్తాయి. రెండో భాగంలో మాత్రం భూకంపమే అని సంకేతాలిచ్చారు. మరోవైపు మూడు గంటలు నిడివి ఉన్నా సినిమా అలా సాగిపోతూ ఉండటానికి కారణం అతిథి పాత్రలు. అవి కనిపించిన ప్రతిసారీ థియేటర్‌లో ఓ జోష్ వస్తుంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పేర్లు రామ్‌గోపాల్ వర్మ, రాజమౌళి, విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్, దుల్కర్ సల్మాన్ తదితర పాత్రలు కథానుసారం ప్రవేశపెట్టిన తీరు అలరిస్తుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. సంతోష్‌నారాయణ్ నేపథ్య సంగీతం, జోర్డే కెమెరా పనితనం చిత్రానికి ప్రధానబలం. ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్ సినిమాని మరోస్థాయిలో నిలబెట్టాయి. దర్శకుడు నాగ్ అశ్విన్ విజువలైజేషన్, ఆయన చెప్పిన కథ మనసుల్ని హత్తుకుంటుంది.

## ప్రసాద్ ఐ మాక్స్ వద్ద సందడి



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిన 'కల్కి 2898 ఏడీ' రిలీజ్ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ వద్ద సందడి నెలకొంది. సినిమా చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సినిమాలో ఉపయోగించిన 'బుజ్జి' (వాహనం)ని అక్కడ ప్రదర్శనకు ఉంచారు. దాని వద్ద ఫొటోలు తీసుకునేందుకు ఫ్యాన్స్ పోటీ పడ్డారు.

## విజయ్ సరసన.. జాన్వీ

అగ్రనటుడు విజయ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ నటించనుందనే వార్త కోలీవుడ్‌లో హల్చల్ చేస్తుంది. ప్రస్తుతం విజయ్ 'ది గోట్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత హెచ్. వినోద్ దర్శకత్వంలో విజయ్ తన 69 వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించినప్పటికీ చివరకు జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవలకాలంలో జాన్వీ కపూర్ ఎక్కువగా ముంబై టు చెన్నై మధ్య చక్కర్లు కొడుతున్నారు. చెన్నైతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని పుణ్యస్థలాలను సందర్శిస్తోంది. అయితే, తన తల్లి శ్రీదేవి నిలదొక్కుకున్న తమిళంలో తాను ఎంట్రీ ఇచ్చేందుకు ఆమె ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన కుమార్తె కోర్కెను తీర్చేందుకు ఆమె తండ్రి, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ ముందుకు వచ్చారు. విజయ్ 69వ చిత్రంలో కుమార్తెకు అవకాశం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. హెచ్. వినోద్ దర్శకత్వంలో అజిత్ హీరోగా నటించిన 'వలిమై', 'తుణివు' చిత్రాలను బోనీ కపూర్ నిర్మించారు. దీంతో దర్శకుడు హెచ్. వినోద్ – బోనీ కపూర్ మధ్య మంచి సత్సంబంధాలు ఉండటంతో విజయ్ చిత్రంలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా నటింపజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని టాక్ వినిపిస్తుంది.





# లోటుపాట్లు ఉండొద్దు

## మంత్రులు సురేఖ, సీతక్క
## సీఎం పర్యటనపై అధికారులతో సమీక్ష

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీఎం పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్ ను జాగ్రత్తగా పర్యవేక్షించడంతో పాటు, ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డికి నివేదించనున్న పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, భూగర్భ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం, మామునూరు ఎయిర్ పోర్ట్, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, హన్మకొండ ఐడీఓసీ కార్యాలయంలో చేపట్టనున్న వనమహోత్సవం, మహిళాశక్తి కార్యక్రమం తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్య శారదా దేవి, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పలువురు అధాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ కడియం కావ్యను సన్మానించిన ఢిల్లీ కాంగ్రెస్ నేతలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఢిల్లీలోని ఎంపీ క్వార్టర్స్ లో జాతీయ సఫాయి కర్మ చారి సంఘం నాయకులతో పాటు పలువురు ఈస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో మొదటిసారి ఎంపీగా ఎన్నికైన డాక్టర్ కడియం కావ్యకు పుష్ప గుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ సఫాయి కర్మ చారీ సంఘం జాతీయ అధ్యక్షులు అమిత్ కుమార్, ఈస్ట్ ఢిల్లీ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమార్ లోహేరా, మాజీ కార్పొరేటర్ సంజీత్ శర్మ, డీపీసీసీ నాయకులు జోగిందర్ సింగ్ జోగి, మాజీ డీపీసీసీ అధ్యక్షులు ఆకాష్, ఈస్ట్ ఢిల్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనిల్ కుమార్, గజవెల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

# రాందేవ్‌కు నామినేటెడ్ పదవీ ఇవ్వండి

## సీఎంకు మాజీ మంత్రి పురుషోత్తం రావు లేఖ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కాంగ్రెస్ పార్టీకి మొదటినుంచి అండగా ఉంటూ వీర విధేయుడిగా గుర్తింపు తెచ్చుకున్న 40వ డివిజన్ నాయకుడు దాసి రాందేవ్ కు నామినేటెడ్ పదవి ఇవ్వాలంటూ మాజీ మంత్రి తక్కళ్లపల్లి పురుషోత్తం రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. నా శిష్యుడైన రాందేవ్ 1989నుంచి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నాడన్నారు. 2005లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా బరిలో నిలిచారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆ నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాలనలో 2007 నుంచి 2014 వరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మద్య విమోచన ప్రచార కమిటీ డైరెక్టర్ గా పనిచేశారని గుర్తు చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న నా శిష్యుడు రాందేవ్ ను మీ వద్దకు పంపిస్తున్నా..తగిన గుర్తింపునిచ్చి ఏదైనా ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇప్పించాలని ఆ లేఖలో పురుషోత్తం రావు కోరారు. ఈ లేఖ బుధవారం సీఎంఓ కార్యాలయం చేరింది.

# రేపు పీవీ జయంతి ఉత్సవాలు

## ముఖ్య అతిథిగా పాల్గొననున్న మంత్రి పొన్నం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధాని భారతరత్న పీవీ.నరసింహారావు 103వ జయంతి ఉత్సవాలను జూన్ 28న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ.ప్రభాకర్ రావు, కార్యక్రమ సమన్వయకర్త, సీనియర్ జర్నలిస్ట్ పీవీ.మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జేఎన్ ఎస్ కూడలిలోని పీవీ.నరసింహారావు కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నట్లు ప్రకటించారు. కెప్టెన్ లక్ష్మీకాంత రావు సారథ్యంలోని ఏకశిలా ఎడ్యుకేషనల్ సొసైటి ఆధ్వర్యంలో ఉదయం 11.30గంటలకు పీవీ స్వస్థలం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో జయంత్యుత్సవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం వంగర రత్నగిరి కూడలిలో పీవీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నట్లు వెల్లడించారు. పీవీ స్వగృహంలో జరిగే జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొననున్నట్లు తెలిపారు.

# ఓరుగల్లు సమగ్రాభివృద్ధిపై శ్రద్ధ

## మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన నేపథ్యంలో మీడియా సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. మీడియా సమావేశంలో రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి నేరుగా హెలికాప్టర్ ద్వారా వరంగల్ టెక్స్టైల్ పార్కు కు చేరుకుంటారని అన్నారు. టెక్స్టైల్ పార్కులో ఫోటో ఎగ్జిబిషన్ ను సీఎం పరిశీలిస్తారని పేర్కొన్నారు. వరంగల్ టెక్స్టైల్ పార్కు సందర్శన అనంతరం పూర్వ సెంట్రల్ జైల్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పరిశీలిస్తారని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై అధికారులతో సీఎం సమీక్షిస్తారని అన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కు చేరుకొని అభివృద్ధిపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షిస్తారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. దీనికి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీగా, అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్ గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని రంగాలలో వరంగల్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కుడా పరిధిలోని ఇతర జిల్లాల ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్. నాగరాజు, పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యా యత్నం

## పురుగుల మందు డబ్బాతో చెట్టుపై హల్చల్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టునెక్కి రైతు ఆత్మహత్యా యత్నం చేయడం సంచలనంగా మారింది. చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకొని భూక్య బాలు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ప్రకటించడంతో సిబ్బంది ఒక్కసారిగా నివ్వెర పోయారు. రంగప్రవేశం చేసిన పోలీసులు, తహసీల్దార్ బాధితుడితో మాట్లాడి భూ సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. కాగా బాధిత్నుడు భూక్య బాలు చెప్పిన వివరాల ప్రకారం పెద్ద నాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని హజ్ తండాలో తనకు రెండు ఎకరాల భూమి ఉండగా తన భూమిని భూక్య హరిలాల్, భద్రుల పేరిట పట్టా చేశారని, దీంతో తను సర్వేకు అప్లై చేయగా వారు అడ్డు తగిలారని ఆరోపించారు. తన భూమిని తనకు ఇప్పించాలని పలు మార్లు తహసీల్దార్ కు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తన రెండు ఎకరాల భూమిని తన పేరిట చేయకపోవడంతో అన్యాయం జరిగిందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com